సాక్షి
పార్వతీపురం మన్యం

ఆదివారం । 12 । జనవరి । 2025



108 సేవల్లో జాప్యం..!

జిల్లాలో 108 అంబులెన్సులు సరిపడా లేకపోవడంతో ఆపదవేళ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. - 8లో



ఒప్పో రెనో 13 సిరీస్ ఫోన్ల విడుదల - 8లో


సెల్ పాయింట్ ఇండియా ఒప్పో రెనో 13 సిరీస్‌ను శనివారం లాంచ్ చేసింది.

15న వీరఘట్టంకు బౌద్ధ భిక్షువు

వీరఘట్టం: ఇండియన్ హెర్క్యులస్, కలియుగభీముడు, మల్లమార్తాండగా ప్రపంచ దేశాల్లో భారతదేశ కీర్తి ప్రతిష్టలను చాటిచెప్పిన బాహుబలి కోడి రామ్మూర్తినాయుడు విగ్రహానికి నివాళులర్పించేందుకు శ్రీలంకకు చెందిన బౌద్ధ భిక్షువు బోధిహీన్ ఈ నెల 15న వీరఘట్టం రానున్నారు. కోడి రామ్మూర్తి పుట్టిన ప్రదేశాన్ని, తిరిగాడిన ప్రాంతాన్ని, ఆయన స్వగృహాన్ని బోధిహీన్ సందర్శించనున్నట్టు సమాచారం.

కళ తప్పిన సంక్రాంతి

సంక్రాంతి వచ్చినా మార్కెట్‌లో సందడి కనిపించడం లేదు. ఓ వైపు వరుస తుఫాన్లు, ప్రభుత్వం నుంచి పైసా పెట్టుబడిసాయం, పరిహారం అందకపోవడం, అపరాల పంటలు పూర్తిగా పాడవ్వడం, పంటకు గిట్టుబాటు ధరలు లేకపోవడంతో రైతన్న డీలా పడ్డాడు. ఫీజురీయింబర్స్‌మెంట్, తల్లికివందనం వంటి పథకాల నిధులు విడుదల కాక పిల్లల ఫీజులచెల్లింపు భారంగా మారింది. స్వయం ఉపాధికి 'చేయూత'కరువైంది. పండగొచ్చినా అంగన్‌వాడీ, కాంట్రాక్టు ఉద్యోగులకు వేతనాలు అందలేదు. మరోవైపు నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. ఫలితం... పల్లెగూడికి పండగొచ్చినా.. పేద, మధ్యతరగతి, రైతు కుటుంబాల్లో ఆ ఉత్సాహం ఎక్కడా కనిపించడం లేదు. రద్దీగా ఉండాల్సిన మార్కెట్లు కొనుగోలుదారులు లేక బోసిపోతున్నాయి. వ్యాపార వర్గాల్లోనూ పండగ కళ తప్పింది.



శనివారం సాయంత్రం 5 గంటలకే కొనుగోలుదారులు లేక వెలవెలబోతున్న వీరఘట్టం మార్కెట్ రోడ్డు

- రైతన్నకు అందని ప్రభుత్వ సాయం
- వరున తుఫాన్‌లతో కలిసిరాని పంటలు
- చేతికొచ్చిన పంటకూ గిట్టుబాటు ధర లేని వైనం
- అన్నివర్గాలూ 'సంక్షేమానికి' దూరం
- ఆకాశాన్ని తాకుతున్న నిత్యావసర సరుకుల ధరలు
- చేతిలో డబ్బులు లేక అన్నివర్గాలు డీలా
- వెలవెలబోతున్న కిరాణా, వస్త్ర, బంగారం వ్యాపారాలు
- గతేడాదితో పోలిస్తే కనీసం 50 శాతం వ్యాపారాలు జరగలేదంటున్న వ్యాపారులు

గత ఏడాది సంక్రాంతి రోజుల్లో సాగిన వస్త్ర వ్యాపారం	రూ.15కోట్లు
ఈ ఏడాది ఇప్పటివరకు సాగిన వ్యాపారం	రూ. 4 కోట్లు
గత ఏడాది సంక్రాంతి రోజుల్లో సాగిన బంగారం వ్యాపారం	రూ.5 కోట్లు
ఈ ఏడాది ఇప్పటివరకు సాగిన వ్యాపారం	రూ. 3 కోట్లు

సాక్షి, పార్వతీపురం మన్యం/పార్వతీపురంటౌన్/సాలూరు/వీరఘట్టం: సంక్రాంతి పండగ వస్తుందంటే.. జనవరి మొదటి రోజు నుంచే వస్త్ర, బంగారం, కిరాణా వ్యాపారాలు కళకళలాడేవి. స్థానికంగా ఉన్న వస్త్రవ్యాపారాలతో పాటు.. ఇతర రాష్ట్రాల నుంచి తీసుకొచ్చి, రోడ్డు పక్కన విక్రయించే దుకాణాలూ కిటకిటలాడేవి. పండగకు వారం రోజుల ముందు నుంచే ఇళ్లలో పిండి వంటలు ఘుమఘుమలాడేవి. నేడు పేద, మధ్య తరగతి ప్రజానీకం ఇళ్లలో సంక్రాంతి పండగ కళ తప్పింది. ఓ వైపు నిత్యావసర వస్తువుల ధరలు చుక్కలను తాకుతుండటం, రాబడి తగ్గి వ్యయం పెరగడం ఒక కారణమైతే... వ్యవసాయం కలిసిరాకపోవడం, రైతన్న చేతిలో డబ్బులు లేకపోవడం మరో కారణం. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రజలకు ప్రధాన ఆధారమైన పంటల సాగుకు సాయం తంచన్‌గా అందేది. విపత్తుల సమయంలో పరిహారం మంజూరయ్యేది. రైతన్న కోలుకుని ప్రత్నామ్నాయ పంటల సాగుకు వీలుకలిగేది. సాగు భరోసా ఉండేది. ఇప్పుడు ఆ భరోసా కరువవ్వడంతో కాడివిడిచిపెట్టే పరిస్థితి నెలకొంది. రైతన్న చేతిలో డబ్బులు లేకపోవడంతో ఆ ప్రభావం వ్యాపారాలపై పడింది.



కొనుగోలుదారుల కోసం ఎదురుచూస్తున్న వస్త్ర వ్యాపారులు

జోరు తగ్గిన వ్యాపారాలు

జిల్లా విభజనకు ముందు పార్వతీపురం పరిసర ప్రాంతాలతోపాటు.. ఒడిశా నుంచి కూడా విజయనగరం మార్కెట్‌కు పండగ సమయంలో వెళ్లేవారు. పార్వతీపురం మన్యం జిల్లా ఆవిర్భావం తర్వాత వివిధ ప్రముఖ వస్త్ర దుకాణాలు, బ్రాండెడ్ షోరూంలు, జ్యూవెలరీ షాపులు, ఇతర అలంకరణ సామగ్రి, ఫుట్‌వేర్ షాపులు పార్వతీపురంలోనే అధికంగా పుట్టుకొచ్చాయి. గతంలో డిసెంబర్ చివరి వారం నుంచి పండగ ముందు రోజు వరకూ మార్కెట్ కిటకిటలాడేది. ప్రధానంగా వస్త్ర దుకాణాల్లో ఇసుకేస్తే రాలనంత జనం ఉండేవారు. ప్రస్తుతం జనవరి మొదటి వారంలోనూ తాకిడి కనిపించలేదు. గతంతో పోల్చుకుంటే వస్త్ర వ్యాపారం 60 శాతం తగ్గిందని వ్యాపారులే చెబుతున్నారు. ప్రజల చేతుల్లో డబ్బులు లేకపోవడం వల్ల 40 శాతం వ్యాపారం తగ్గితే.. ఆన్‌లైన్ మార్కెటింగ్ పుణ్యమానీ మిగిలిన 20 శాతం మంది దుకాణాలకు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంక్షేమ పథకాల పుణ్యమానీ గత వైఎస్సార్‌సీపీ పాలనలో జిల్లాలో పేద, మధ్యతరగతి ప్రజలకు రూ.వేల కోట్ల లబ్ధి చేకూరింది. ఒక్క సాలూరు నియోజకవర్గంలోనే వివిధ పథకాల ద్వారా రూ.1,600 కోట్ల మేర పేదలకు లబ్ధి కలిగింది. 'అప్పట్లో దేనికీ లోటు లేకుండా పండగ చేసుకునే వారం. పిల్లలకు కొత్త దుస్తులు కొనుగోలు చేసేవాళ్లం. ఇప్పుడు ఏ పథకాలిచ్చారని, డబ్బులు ఉండటానికి! దీనికితోడు నిత్యావసర సరకుల ధరలు, విద్యుత్ బిల్లులు చుక్కలు చూపిస్తున్నాయి.' అని సాలూరుకు చెందిన ఓ గృహిణి వాపోయింది.



పార్వతీపురంలో వెలవెలబోతున్న ఫుట్‌పాత్ వ్యాపారం

రైతుల్లోనూ కానరాని సందడి

సంక్రాంతి అంటేనే రైతుల పండగ. ధాన్యం రాశులు ఇంట చేరి, ధాన్యలక్ష్మి నట్టింట తిరగాడే రోజులు. పంటను విక్రయించడం ద్వారా వచ్చిన నగదుతో ఇంటిల్లపాదీ పండగను హాయిగా జరుపుకొనేవారు. ఖరీఫ్ సాగు సమయంలో అకాల వర్షాల వల్ల రైతు చాలా వరకు నష్టపోయాడు. విక్రయించిన పంటకు మద్దతు ధర దక్కలేదు. మరోవైపు ఏనుగుల గుంపు మరికొంత పంటను ధ్వంసం చేశాయి. ఇటీవల కురిసిన వర్షాలకు అపరాల పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. దీంతో రైతుల ఇంట పండగ కాంతి కనిపించడం లేదు.

ఏదీ.. నాటి కళ

పెద్ద పండగ వచ్చిందంటే ప్రతి ఇంటా ఆనంద సంబరమే. వస్త్రాలతో పాటు బంగారు వస్తువులను కొనుగోలు చేసే దుకాణాలు కళకళలాడేవి. మహిళలు వివిధ అలంకరణ సామగ్రి కొనుగోలు చేసుకునేవారు. చెప్పుల దుకాణాల్లో విక్రయాలు జోరుగా సాగేవి. అన్నింటికీ మించి పండగ పిండి వంటలతో ప్రతి ఇల్లూ ఘుమఘుమలాడేది. ఏటా క్రిస్మస్, జనవరి 1, సంక్రాంతి పండగల సందర్భంగా జిల్లాలోని పార్వతీపురం, సాలూరు, పాలకొండ తదితర పట్టణాలు, మేజర్ పంచాయతీల్లో వస్త్ర వ్యాపారం రూ. 10 కోట్ల నుంచి రూ.15 కోట్ల వరకు జరిగేదని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. ఈ ఏడాది ఇప్పటివరకూ కేవలం రూ.4 కోట్ల వరకు జరిగినట్టు చెబుతున్నారు. గ్రామాల్లో చిన్న షాపుల నుంచి పట్టణాల్లోని పెద్ద మాల్స్ వరకూ వస్త్ర వ్యాపారం మునుపటి స్థాయిలో జోరు కనిపించడం లేదు. ఇక సంక్రాంతి రోజున కొత్త అల్లుళ్లు, కోడళ్లకు బంగారు ఆభరణాలు పెట్టడం ఆనవాయితీ కావడంతో మధ్యతరగతి నుంచి ఉన్నత వర్గాల వరకూ జ్యూయలరీ వస్తువులు కొనుగోలు చేస్తుంటారు. ఏటా పండగ సీజన్‌లో రూ.5 కోట్ల వరకూ వ్యాపారం జరిగేది. ప్రస్తుతం ఆ వ్యాపారం రూ.3 కోట్లకే పరిమితమైందని ఆయా వ్యాపార వర్గాలు తెలిపాయి. చివరి రెండు రోజులైనా వ్యాపారం జోరందుకుంటుందని ఆశిస్తున్నారు. గతంలో నిత్యావసర వస్తువుల వ్యాపారమే రూ.2 కోట్లకుపైగా జరిగేది. ఓవైపు చేతిలో డబ్బులు లేకపోవడం, మరోవైపు పెరిగిన ధరలతో మార్కెట్‌కు పండగ కళ తప్పిపోయింది.

సాధారణ రోజులే నయం



ఈ ఏడాది సంక్రాంతి పండగకు కిరాణా సామగ్రి ఎక్కువగా సేల్ అవుతాయని అనుకున్నాం. ప్రస్తుత వ్యాపారం సాధారణ రోజుల కంటే దారుణంగా ఉంది. సోమవారం నుంచి భోగి పండగ జరగనుంది. ఇంతలోనే వ్యాపారాలు జరగాలి. ఆశించినంతగా బేరాలు లేవు.

– వారణాశి ఉమామమేశ్వరరావు, కిరాణా వ్యాపారి, వీరఘట్టం

9 గంటలకే దుకాణాల మూత



గత పండగ సీజన్లలో రాత్రి 12 గంటలకు షాపులు మూసేవాళ్లం. ప్రస్తుతం వ్యాపారాలు లేక రాత్రి 9 గంటలలోపే షాపు కట్టేస్తున్నాం. మార్కెట్ అంతా నిర్మానుష్యంగా మారుతోంది. గతేడాదితో పోల్చితే 50 శాతం వ్యాపారం ఈ ఏడాది జరగలేదు.

– అందవరపు మణికంఠ, వస్త్ర వ్యాపారి, వీరఘట్టం

వ్యాపారాలు సరిగా లేవు



గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది వ్యాపారం సరిగా జరగలేదు. పూర్తిగా నష్టాలు వాటిల్లాయి. గతేడాది ప్రజల వద్ద సొమ్ము ఉండడంతో లాభాలు గడించాం. ఈ ఏడాది ప్రభుత్వం మారడంతో ఎటువంటి సంక్షేమ పథకాలు అందక ప్రజల వద్ద సొమ్ములేక ఆ ప్రభావం మాలాంటి చిరు వ్యాపారులపై పడింది. ఏటా కర్నూలు నుంచి వచ్చి వ్యాపారం చేసేవాళ్లం. ఈ ఏడాది నష్టపోయాం.

– సుబ్బు, ఫుట్‌పాత్ వ్యాపారి, కర్నూలు

నష్టాలు చవిచూశాం



ఈ ఏడాది వ్యాపారాలు సరిగా లేక నష్టాలు చవిచూశాం. గొడౌన్లలో కొనుక్కున్న సరుకుల్లో 50 శాతం కూడా చెల్లుబాటు కాలేదు. గత మూడేళ్లుగా నంద్యాల నుంచి వచ్చి వ్యాపారాలు చేస్తున్నాం. ఈ ఏడాది అంత నష్టాలు ఎప్పుడూ రాలేదు. పంటలు కలిసిరాకపోవడం, ప్రభుత్వం నుంచి సాయం అందకపోవడంతో డబ్బులు లేవని రైతన్నలు చెబుతున్నారు. ఈ ఏడాది పూర్తిగా నష్టపోయాం.

– చిన వెంకట సుబ్బయ్య, ఫుట్‌పాత్ వ్యాపారి, నంద్యాల

న్యూస్‌రీల్

ఘనంగా వడ్డే ఓబన్న జయంతి



ఓబన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, తదితరులు

పార్వతీపురం: స్వాతంత్య్ర సమరయోధుడు వడ్డె ఓబన్న జయంతిని కలెక్టర్ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఓబన్న చిత్రపటానికి కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 1870 జనవరి 11వ తేదీన నంద్యాల జిల్లా సంజమల మండలం నొస్సం గ్రామంలో వడ్డె సుబ్బన్న, సుబ్బమ్మ దంపతులకు జన్మించిన ఓబన్న బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా చేసిన పోరాటంలో కీలకపాత్ర పోషించారు. రైతులు, గ్రామాల హక్కులు కాపాడేందుకు ప్రాణాలను త్యాగం చేశారన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత, కేఆర్‌సీ ప్రత్యేక ఉపకలెక్టర్ పి.ధర్మచందర్ రెడ్డి, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి లోచర్ల రమేష్, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి ఎస్.కృష్ణ, ఎఫ్–సెక్షన్ పర్యవేక్షకులు జి.శ్రీరామమూర్తి, వడ్డే కుల అధ్యక్షుడు కె.శంకరరావు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ అమలు ఎప్పుడు బాబు?

- ప్రశ్నించిన దివ్యాంగ విభాగం వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ముళ్ల ప్రసాద్



వీరఘట్టం: అధికారంలోకి వస్తే 50 ఏళ్లు దాటిన వారికి పింఛన్... అర్హులు ఉంటే ప్రతి ఇంటిలో రెండు పింఛన్లు ఇస్తామన్న హామీని ఎప్పుడు అమలుచేస్తారో సీఎం చంద్రబాబునాయుడు చెప్పాలని దివ్యాంగ విభాగం వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ముళ్ల ప్రసాద్ ప్రశ్నించారు. వండువ గ్రామంలో శనివారం మీడియాతో మాట్లాడారు. అధికారులు అన్ని పరీక్షలు చేసి మంజూరు చేసిన సదరం ధ్రువపత్రాలు నకిలీవిగా పేర్కొని సర్వేల పేరుతో పింఛన్ల తొలగింపునకు పూనుకోవడం విచాకరమన్నారు. అర్హులైన దివ్యాంగుల పింఛన్లు తొలగిస్తే పోరుబాట సాగిస్తామని హెచ్చరించారు.

దేహదారుఢ్య పరీక్షలకు 384 మంది హాజరు



పరుగుపందెంలో పాల్గొన్న అభ్యర్థులు

విజయనగరం క్రైమ్: జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో కానిస్టేబుల్ అభ్యర్థులకు శనివారం నిర్వహించిన దేహదారుఢ్య పరీక్షలకు 600 మందికి 384 మంది హాజరైనట్టు ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. వీరిలో 286 మంది తుది రాతపరీక్షకు అర్హత సాధించారన్నారు. నియామక ప్రక్రియను అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, ఏఆర్ అదనపు ఎస్పీ జి.నాగేశ్వరరావు, డీఎస్పీలు, సీఐలు పర్యవేక్షించారు.

డ్రోన్ల వినియోగం పెరగాలి



సెంచూరియన్‌లో డ్రోన్ల తయారీ యూనిట్‌ను పరిశీలిస్తున్న కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, మంత్రి కొండపల్లి

నెల్లిమర్ల రూరల్: వ్యవసాయ రంగంలో పురుగు మందుల వాడకాన్ని తగ్గించాలన్నా, సాగు ఖర్చులు తగ్గాలన్నా డ్రోన్ల వినియోగం పెరగాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు అభిప్రాయపడ్డారు. మండలంలోని టెక్కలి సెంచూరియన్ యూనివర్సిటీలో ఏరోనాటిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డ్రోన్ల తయారీ యూనిట్‌ను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రోన్ల తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయడం వల్ల విద్యార్థులకు వాటిపై అవగాహన కల్పించడంతో పాటు పరిశ్రమలకు మార్కెట్ అవసరాలు తీర్చడానికి దోహదపడుతుందన్నారు. డ్రోన్ల వాడకాన్ని పెంపొందించేందుకు ప్రధాని నరేంద్రమోదీ ఇటీవల పీఎల్‌ఐ పథకాన్ని ప్రవేశ పెట్టారని గుర్తు చేశారు. రాష్ట్రంలో డ్రోన్ల హబ్ ఏర్పాటు చేసేందుకు సీఎం చంద్రబాబు డ్రోన్ పాలసీని తీసుకువచ్చార ని చెప్పారు. డ్రోన్లకు సంబంధించి ఉత్తరాంధ్రకు సెంచూరియన్ ప్రధాన కేంద్రంగా మారబోతోందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌తో కలిసి జైరో ప్లేన్, ఇ–రిక్షాల తయారీ, కుట్టు యంత్రాల యూనిట్, ల్యాబ్‌లను పరిశీలించారు. విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులను తిలకించారు.



వివేకానందుని సందేశాలే స్ఫూర్తి..

సేవా మార్గంతో కీర్తి

- నేడు జాతీయ యువజన దినోత్సవం

వారందరికీ వివేకానందుని బోధనలే స్ఫూర్తి మంత్రాలు. ఆయన అడుగుజాడలే శిరోధార్యం. విద్యార్థిగా, పాలకులుగా, క్రీడాకారులుగా, ఉద్యోగులుగా కొనసాగుతూనే సమాజ సేవలో భాగస్వాములవుతున్నారు. పదిమందికీ ఉపయోగపడే పనులతో ముందుకు సాగుతున్నారు. విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు. నేడు జాతీయ యువజనోత్సవం సందర్భంగా ఉమ్మడి విజయనగరం జిల్లాలో కొందరు అందిస్తున్న సామాజిక సేవలను వారి మాటల్లోనే విందాం.

– కొత్తవలస/గుమ్మలక్ష్మీపురం

• విద్యాభివృద్ధికి కృషి



ఆదివాసీ వృద్ధులకు దుప్పట్లు అందజేస్తున్న యస్ సొసైటీ కార్యదర్శి షేక్‌గౌష్

వివేకానంద స్ఫూర్తితో ఏర్పాటుచేసిన యూత్ ఎంపవర్ మెంట్ సర్వీస్ సొసైటీ (యస్ సొసైటీ) కురుపాం కేంద్రంగా ఆదివాసీ ప్రాంతాల్లో యువతను సమాఖ్యపరుస్తోంది. విద్య, సామాజిక వికాసానికి దోహదపడుతోంది. ఆదివాసీలకు చదువు వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తూ పిల్లలను బడికి పంపించేందుకు తమవంతు కృషిచేస్తోంది. ఒక్క ఏడాదిలోనే 200 మంది బడిబయట ఉన్న పిల్లలను బడిలో చేర్పించింది. చదువులో ప్రతిభ చూపే విద్యార్థులకు వివిధ పోటీపరీక్ష మెటీరియల్‌ను ఉచితంగా అందిస్తోంది. గిరిజన గూడల్లో గ్రంథాలయాలు ఏర్పాటుచేసి పఠనాసక్తిని పెంపొందిస్తోంది. సెట్వీజ్ సహకారంతో ఆదివాసీ ప్రాంతాల్లో యువతకు వ్యక్తిత్వ వికాసం, హెల్మెట్ వినియోగం, మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ఉండేలా, బాల్యవివాహాలు మరియు మహిళలపై జరిగే హింసకు వ్యతిరేకంగా సొసైటీ సభ్యులు అవగాహన కల్పిస్తున్నారు.



కొత్తవలస కూడలిలో ఏర్పాటుచేసిన స్వామి వివేకానంద విగ్రహం

• చదువు సాయం

నా పేరు మాచవరపు గణేష్. మాది లక్కవరపుకోట మండలం చందులూరు పంచాయతీ పరిధిలోని కొత్తచందులూరు గ్రామం. చిన్నప్పటి నుంచి వివేకానందుని స్ఫూర్తి మంత్రాలు చదివేవాడిని. క్రమశిక్షణతో చదివి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం సాధించాను. సహచరులతో కలిసి 'సాహసం స్వచ్ఛంద సేవాసంస్థను' ఏర్పాటుచేశాను. విజయనగరం, విశాఖపట్నం జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలలను దత్తత తీసుకుని విద్యార్థులకు కావాల్సిన సదుపాయాలు సమకూర్చుతున్నాం. పుస్తకాలు, స్టడీ మెటీరియల్, క్రీడాపరికరాలు, కంప్యూటర్లు, దుస్తులు తదితర సామగ్రిని అందజేస్తున్నాం. మా సంస్థ సేవలకు 2022లో అప్పటి ఉపముఖ్యమంత్రి పాములపుష్పశ్రీవాణి చేతుల మీదుగా అవార్డు అందజేశారు. ప్రతి ఒక్కరూ వివేకానందుని మార్గంలో నడవాలి. సమాజప్రగతికి పాటుపడాలి.



విద్యార్థులకు అభ్యసనా సామగ్రిని అందజేసిన సాహసం ట్రస్టు సభ్యులు

• ఆయన సందేశమే స్ఫూర్తి



నాకు క్రికెట్ అంటే ఇష్టం. ఇప్పటికే రాష్ట్రస్థాయిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరపున పలు మ్యాచ్‌లు ఆడాను. ప్రస్తుతం అండర్– 17 విభాగంలో జాతీయ జట్టుకు ఎంపికయ్యాను. బాగా డిప్రెషన్‌లో ఉన్నప్పుడు స్వామి వివేకానందుడి సూక్తులు చదువుతాను. దేశానికి ప్రాతినిధ్యం వహించి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకోవాలన్నదే నా తపన.

– కె.పుష్పితగౌడ్, కొత్తవలస హైస్కూల్, అండర్–17 విభాగంలో జాతీయ జట్టుకు ఎంపికైన క్రీడాకారిని

• పేదలకు అండగా..



వృద్ధులకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న యువకుడు హరికుమార్

కొత్తవలస మండలంలోని తుమ్మికాపల్లి గేటు సమీపంలోని వినాయకనగర్‌కు చెందిన వి. హరికుమార్ వివేకానందుని స్ఫూర్తితో 'ఫర్‌ద పీపుల్ చారిటబుల్ ట్రస్టు'ను ఏర్పాటుచేశారు. వృద్ధులు, ఒంటరి మహిళలకు ప్రతినెలా నిత్యావసర సరుకులను అంజేస్తూ స్ఫూర్తిదాయకంగా ముందుకు సాగుతున్నారు. యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు. మనం నిరాశ, నిస్పృహలో ఉన్నప్పుడు వివేకానందుని సూక్తులను గుర్తు చేసుకుంటే వెయ్యి ఏనుగుల బలం వస్తుందని, అదే మనల్ని మంచి మార్గంలో నడిపిస్తుందని హరికుమార్ తెలిపారు.

ఆకట్టుకున్న రంగవల్లులు



ముగ్గులను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: సంక్రాంతి వేడుకల్లో భాగంగా స్త్రీశిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయ ఆవరణలో శనివారం నిర్వహించిన ముగ్గుల పోటీలు అందరినీ ఆకట్టుకున్నాయి. మహిళలు, చిన్నారులు ముగ్గుల పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. కలెక్టర్ కార్యాలయ ముఖద్వారం నుంచి ప్రధాన రహదారి గేటు వరకు దారిపొడవునా వేసిన రంగవల్లులను కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తిలకించారు. సంస్కృతీ, సంప్రదాయాలు ప్రతిబింబించేలా ముగ్గులు ఉన్నాయంటూ మహిళలను అభినందించారు. ముగ్గుల పోటీల్లో విజేతలుగా నిలిచిన ఎస్.గౌరమ్మ, జి.శ్రావణి బృంద సభ్యులు (ప్రథమ), కె.పవిత్ర (ద్వితీయ)కు బహుమతులు అందజేశారు. న్యాయనిర్ణేతగా పార్వతీపురం మండల విద్యాశాఖ అధికారి వై.విమలకుమారి వ్యవహరించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత, ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి కనకదుర్గ, సీడీపీఓలు పాల్గొన్నారు.

• సంక్రాంతి సంబరాలు



బాలికల జానపద నృత్యం

జిల్లా స్థాయి సంక్రాంతి సంబరాలను పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ శనివారం ప్రారంభించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలను తిలకించారు. కార్యక్రమంలో ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాస్తవ, తదితరులు పాల్గొన్నారు.

– పార్వతీపురంటౌన్



నృత్యప్రదర్శనలను ఆసక్తిగా తిలకిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాస్తవ

క్లుప్తంగా

24, 25 తేదీల్లో జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు

- జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు డాక్టర్ బీఎస్ ప్రసాద్

విజయనగరం: జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 24, 25 తేదీల్లో జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ ఉపాధ్యక్షుడు డాక్టర్ వివి ఎస్.ప్రసాద్ తెలిపారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 24న అండర్ – 13, 15, 17 వయస్సుల విభాగంలో బాల, బాలికలకు సింగిల్స్ విభాగంలో పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ నెల 25న పురుషులకు డబుల్స్ విభాగంలో వెటరల్ పోటీలు నిర్వహించటం జరుగుతుందని పేర్కొన్నారు. పోటీల్లో సింగిల్స్ విభాగంలో పాల్గొనే క్రీడాకారులు రూ.300, డబుల్స్ విభాగంలో పాల్గొనే క్రీడాకారులు రూ.600 ప్రవేశ రుసుం కింద చెల్లించాల్సి ఉంటుందన్నారు. అర్హత, ఆసక్తి గల క్రీడాకారులు ఈ నెల 22వ తేదీలోగా తమ పేర్లను విజయనగరం, ఎస్.కోట, బొబ్బిలి, సాలూరు, పార్వతీపురం, కొత్తవలస, చీపురుపల్లి ప్రాంతాల్లో కోచ్‌ల వద్ద తమ పేర్లు నమోదు చేసుకోవాల్సి ఉంటుందన్నారు.

తల్లీపిల్లల అదృశ్యంపై కేసు

సీతంపేట: సీతంపేటకు చెందిన తల్లీపిల్లలు అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ వై.అమ్మన్నరావు శనివారం తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

ట్రాక్టర్ - మోటార్ సైకిల్ ఢీకొని వ్యక్తికి గాయాలు



ప్రమాదానికి గురైన ట్రాక్టర్, మోటార్ సైకిల్

తెర్లాం: ఎదురెదురుగా వస్తున్న ట్రాక్టర్ మోటార్ సైకిల్‌ను ఢీకొనడంతో ఓ వ్యక్తి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని వెలగవలస గ్రామానికి సమీపంలో జరిగింది. దీనికి సంబంధించి తెర్లాం ఎస్‌ఐ సాగర్‌బాబు శనివారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శుక్రవారం రాత్రి 9గంటల ప్రాంతంలో రాజాం నుంచి వస్తున్న మోటార్ సైకిల్‌ను తెర్లాం వైపు నుంచి రాజాం వైపు వెళ్తున్న ట్రాక్టర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో మోటార్ సైకిల్ నడుపుతున్న మెరకముడిదాం మండలం ఎం.గదబవలసకు చెందిన ఆరంగి పోలినాయుడుకి కాలు విరిగిపోవడంతో పాటు, తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వ్యక్తిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో రాజాం కేర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స చేసి విశాఖపట్నం ఆస్పత్రికి మెరుగైన వైద్య సేవల నిమిత్తం తరలించారు. విశాఖపట్నం ఆస్పత్రి వైద్యులు పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో అక్కడికి వెళ్లి సమాచారాన్ని సేకరించామని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సాగర్‌బాబు తెలిపారు.

మాంగనీసు గనిలో పడి వ్యక్తి మృతి



మాంగనీసు గనిలో పడి మృతి చెందిన రాములు

చీపురుపల్లి: మండలంలోని పేరిపి, చిననడిపల్లి గ్రామాల మధ్య ఉన్న మాంగనీసు గనిలో పడి కొంగరాపు రాములు(65) మృతి చెందాడు. ఐదారు రోజులు క్రితమే రాములు గనిలో పడి మృతి చెందినప్పటికీ శనివారం వరకు తెలియలేదు. శనివారం పొలాలకు వెళ్లిన స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్‌ఐ ఎల్.దామోదరరావు తన సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని వెలికి తీసి పంచనామా నిర్వహించారు. గరివిడి మండలంలోని శివరాం గ్రామానికి చెందిన కొంగరాపు రాములు జనవరి 2 నుంచి మతిస్థిమితం కోల్పోయి గ్రామం నుంచి వచ్చేసాడు. మాంగనీసు గని వైపు నుంచి వెళ్తూ జారిపడి మృతి చెందాడు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ దామోదరరావు తెలిపారు.

కానరాని రక్షణ చర్యలు

ఇదిలా ఉండగా పేరిపి, చిననడిపల్లి గ్రామాల మధ్య నాలుగైదు అతిభారీ మాంగనీసు గనులు ఉన్నాయి. ఈ రెండు గ్రామాలకు చెందిన రైతులు తమ పంట పొలాలు సైతం అటువైపే ఉండడంతో నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. మాంగనీసు గని వద్ద కనీసం పెన్సింగ్ కూడా ఏర్పాటు చేయకుండా యాజమాన్యం నిర్లక్ష్యంగా ఉండడంతో ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. ప్రస్తుతం ఆ గనిలో మాంగనీసు తవ్వకాలు నిలిపివేయడంతో పెన్సింగ్ వేయాలని గ్రామస్తులు యాజమాన్యాన్ని కోరినప్పటికీ పట్టించుకోలేదని రెండు గ్రామాల ప్రజలు పోలీసులకు చెప్పారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹124	₹218	₹228

108 సేవల్లో జాప్యం..!

- తగినన్ని అంబులెన్సులు లేక..
- విజయనగరం నియోజకవర్గం మొత్తానికి ఒకే అంబులెన్సు
- కేసును విశాఖ తరలిస్తే పక్క మండలాల నుంచి రావాల్సిందే..
- జిల్లాలో ఉన్న అంబులెన్సులు 28
- వీటిలో ఒక నియోనేటల్ అంబులెన్సు

విజయనగరంలోని ఉడా కాలనీకి చెందిన పద్మావతి అనే మహిళకు జ్వరంతో పాటు కాళ్లు, చేతులు లేపలేని స్థితిలో ఉండడంతో ఆస్పత్రికి వెళ్లడానికి 108 అంబులెన్సుకు ఫోన్ చేసారు. విజయనగరంలో ఉన్న 108 అంబులెన్సు కేజీహెచ్‌కు వేరే కేసును తీసుకువెళ్లింది. దీంతో గంట్యాడలో ఉన్న 108 అంబులెన్సు ఉడా కాలనీకి వచ్చి పద్మావతిని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చేర్పించారు.

శ్రీకాకుళం నుంచి రైల్లో శనివారం ఎం.జయసుధ అనే మహిళ విజయవాడ వెళ్లేందుకు వస్తుండగా రైల్లో పడిపోయి కోమాలోకి వెళ్లిపోయింది. దీంతో రైల్వే పోలీసులు 108 అంబులెన్సుకు ఫోన్ చేసారు. విజయనగరంలో ఉన్న 108 అంబులెన్సు కేజీహెచ్‌కు వేరే కేసును తీసుకు వెళ్లడంతో గంట్యాడ 108 అంబులెన్సు సిబ్బంది రైల్వేస్టేషన్‌కు వచ్చి ఆ మహిళను ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చేర్పించారు.

గంట్యాడ మండలానికి చెందిన డి.సూరినాయుడు అనే వ్యక్తి కొద్ది రోజులుగా ఆయాసం, దగ్గుతో బాధ పడడంతో కుటుంబ సభ్యులు 108 అంబులెన్సుకు ఫోన్ చేసారు. ఆ సమయంలో గంట్యాడకు చెందిన 108 అంబులెన్సు వేరే కేసును తీసుకు వెళ్లడంతో డెంకాడకు చెందిన 108 అంబులెన్సు వచ్చి ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చేర్పించింది.

విశాఖపట్నం జిల్లా పద్మనాభం మండలం పాండ్రంకి గ్రామానికి చెందిన గురునాయుడు కిడ్నీ సమస్యతో విజయనగరం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చేరారు. అతనికి మెరుగైన వైద్యం కోసం సర్వజన ఆస్పత్రి వైద్యులు కెజీహెచ్‌కు రిఫర్ చేసారు. ఆ సమయంలో విజయనగరంలో ఉన్న 108 అంబులెన్సు విశాఖపట్నం కెజీహెచ్‌కు రోగిని తీసుకుని వెళ్లింది. దీంతో గంట్యాడ 108 అంబులెన్సు గురునాయుడును కేజీహెచ్‌కు తరలించింది.

విజయనగరం ఫోర్ట్: జిల్లాలో సరిపడ 108 అంబులెన్సులు లేకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. సంఘటన స్థలానికి 108 అంబులెన్సు వచ్చేందుకు ఎక్కువ సమయం పడుతుండడంతో రోగుల బంధువుల్లో టెన్షన్ నెలకొంటుంది. సంఘటన స్థలానికి 15, 20 నిమిషాల్లో రావాల్సి ఉండగా 40 నుంచి 50 నిమిషాల సమయం పడుతుంది. అత్యవసర పరిస్థితుల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్టు రోగుల బంధువులు ఆందోళన చెందుతున్నారు. ఆపదలో ఉన్న వారిని ఎంత త్వరగా ఆస్పత్రికి చేర్చగలిగితే అంత మంచిది. త్వరగా ఆస్పత్రికి చేర్చగలిగితే వారి ప్రాణాలు కాపాడడానికి అవకాశం ఉంటుంది. సకాలంలో ఆస్పత్రికి చేర్చలేకపోతే పరిస్థితి విషమించే అవకాశం ఉంటుంది. ఒక్కో సమయంలో ప్రాణాలు పోయే ప్రమాదం కూడా ఉంది.



108 అంబులెన్సు



108 అంబులెన్సులో రోగిని తరలిస్తున్న సిబ్బంది

విశాఖ వెళ్లి వచ్చేందుకు నాలుగు గంటల సమయం

108 అంబులెన్సు జిల్లా కేంద్రం నుంచిగాని ఇతర మండలం నుంచి విశాఖపట్నం రోగులను కేజీహెచ్ తరలించడానికి నాలుగు నుంచి నాలుగున్నర గంటల సమయం పడుతుంది. బొబ్బిలి వంటి ప్రాంతాల నుంచి ఐదు నుంచి గంటల వరకు సమయం పడుతుంది. జిల్లాలో ఉన్న సీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రులు, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి నుంచి కేజీహెచ్‌కు రోగులను తరలిస్తారు. అదేవిధంగా సీహెచ్‌సీ, ఏరియా ఆస్పత్రుల నుంచి ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి 108 అంబులెన్సులు ద్వారా రోగులను తరలిస్తారు. 108 అంబులెన్సులు కేసులను తరలించే సమయంలో ఆ మండలంలో అత్యవసర కేసులు వస్తే పక్క మండలం నుంచి అంబులెన్సు రావడానికి సమయం పడుతుంది.

108 అంబులెన్సులు ఇలా..

జిల్లాలో మండలానికి ఒకటి చొప్పన 27 మండలాలకు 108 అంబులెన్సులు 27 ఉన్నాయి. నవజాతి శిశువుల కోసం జిల్లా అంతటకి ఒకే నియోనేటల్ అంబులెన్సు ఉంది. విజయనగరం నియోజకవర్గం మొత్తానికి ఒకటే అంబులెన్సు ఉంది. విజయనగరం పట్టణంలో మూడు లక్షల వరకు జనాభా ఉంది. మండలంలో 40 వేల నుంచి 50 వేల మంది వరకు ఉంటారు. వీటితో పాటు ప్రభుత్వ వైద్య కళాశాల, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి జిల్లా కేంద్రంలోనే ఉన్నాయి. వీటిన్నటికి ఒకే అంబులెన్సు ఉంది. ఆ ఒక్క అంబులెన్సు ఐఎఫ్‌టీ(ఇంటర్ స్పెషలిటి ట్రాన్స్‌ఫోర్ట్) కేసులకు వెళితే అత్యవసర కేసులకు పక్క మండలం నుంచి 108 రావాల్సి వస్తుంది. పా అంబులెన్సు జిల్లా కేంద్రానికి వస్తే అక్కడ ఏదైనా అత్యవసర కేసు వస్తే అక్కడ రోగులు ఇబ్బంది పడాల్సిన పరిస్థితి. 108 అంబులెన్సు వచ్చే వరకు ఉండలేని పరిస్థితి. దీంతో ప్రైవేటు అంబులెన్సులను రోగులు ఆశ్రయిస్తున్నారు.

పక్క మండలాల నుంచి..

108 అంబులెన్సులు ఐఎఫ్‌టీ కేసులకు వెళ్లినప్పుడు పక్క మండలం నుంచి అంబులెన్సులను పంపించి రోగులను ఆస్పత్రికి తరలిస్తున్నాం. రోగులకు ఇబ్బంది లేకుండా సేవలు అందించడానికి చర్యలు తీసుకుంటున్నాం.

– నజీర్ హుస్సేన్, 108 జోనల్ మేనేజర్

కూరగాయల బజార్ ప్రారంభం



మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్

గజపతినగరం : మండల కేంద్రంలోని నాబార్డ్ సహాయంతో నూతనంగా ఏర్పాటు చేసిన కూరగాయల బజార్‌ను బెస్ట్ మోడల్ బజార్‌గా తీసుకురావాలని రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. గజపతినగరంలో కూరగాయల బజార్‌ను ఆయన శనివారం ప్రారంభించి మాట్లాడారు. రానున్న రోజుల్లో గజపతినగరం కూరగాయల మార్కెట్‌తో పాటు గజపతినగరంలో పలు ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు శాయశక్తులా ప్రయత్నం చేస్తానని మంత్రి అన్నారు. షెడ్లు లీజుకు ఇవ్వకుండా ఎవరైతే సక్రమంగా నడుపుతారో వారికే కేటాయించాలన్నారు. త్వరలో చెత్త ద్వారా సంపద తయారు చేసేందుకు ఒక కార్యాచరణ ప్రణాళికను రూపొందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బెల్లాన జ్ఞాన దీపిక, జెడ్పీటీసీ సభ్యుడు గార తవుడు, సర్పంచ్ నరవ కొండమ్మ, నాబార్డ్ అధికార బృందం, తహసీల్దార్, ఎంపీడీఓ తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితునికి రిమాండ్

వీరఘట్టం: మండలంలోని ఎస్.నర్శిపురం గ్రామానికి చెందిన చింత రామకృష్ణను పిడిగుద్దులు గుద్ది హత్య చేసిన ఇదే గ్రామానికి చెందిన బందలుప్పి కిరణ్‌కు పాలకొండ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్టేట్ విజయ్‌రాజ్ 14 రోజుల పాటు రిమాండ్ విధించినట్లు పాలకొండ సీఐ ఎం.చంద్రమౌళి తెలిపారు. ఈ మేరకు జైలుకు తరలించినట్లు తెలిపారు.

పేకాట శిబిరంపై దాడులు

వీరఘట్టం: మండలంలోని నడిమికెల్లలో గుట్టుగా నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై ఎస్‌ఐ జి.కళాధర్ తన పోలీసు సిబ్బందితో శనివారం దాడులు చేసారు. పోలీసు వస్తున్నట్లు సమాచారం తెలియడంతో చాలా మంది పరారవ్వగా తొమ్మిది మంది పట్టుబడినట్లు ఎస్‌ఐ తెలిపారు. వీరి నుంచి రూ.7,920లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కానిస్టేబుల్‌పై సస్పెన్షన్ వేటు

విజయనగరం క్రైమ్: గంజాయి కోసం చేపట్టిన సోదాల్లో చేతివాటం ప్రదర్శించిన నెల్లిమర్ల పోలీస్ కానిస్టేబుల్ ఎస్.కృష్ణ కిశోర్‌ను సస్పెండ్ చేసినట్లు ఎస్పీ వకుల్ జిందల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సుమారు మూడు నెలల క్రితం నెల్లిమర్ల పోలీసులకు వచ్చిన కచ్చితమైన సమాచారం మేరకు నెల్లిమర్ల ఎస్‌ఐ, పోలీస్ సిబ్బంది ఒక విద్యార్థి గదిలో నిర్వహించిన సోదాల్లో కానిస్టేబుల్ ఎస్.కృష్ణకిశోర్ చేతివాటం ప్రదర్శించినట్లు పోలీసు అధికారులు చేపట్టిన విచారణలో వెల్లడి కావడంతో అతన్ని విధుల నుంచి తాత్కాలికంగా తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. విధి నిర్వహణలో పోలీసు ఉద్యోగులు నిష్పక్షపాతంగా, క్రమశిక్షణతో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే ఉపేక్షించేది లేదని పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే క్రమశిక్షణా చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఒప్పో రెనో 13 సిరీస్ ఫోన్ల విడుదల



ఒప్పో రెనో 13 సిరీస్‌ను లాంచ్ చేస్తున్న సినీ హీరోయిన్ డింపుల్ హయాతి, సెల్‌పాయింట్ ఇండియా చైర్మన్ మోహన్‌ప్రసాద్ పాండే, బాలాజీ పాండే

దాబాగార్డెన్స్: సెల్ పాయింట్ ఇండియా ఒప్పో రెనో 13 సిరీస్‌ను శనివారం లాంచ్ చేసింది. దాబాగార్డెన్స్‌లోని సెల్‌పాయింట్ షోరూంలో సెల్ పాయింట్ ఇండియా చైర్మన్ మోహన్ ప్రసాద్ పాండే నేతృత్వంలో సినీనటి డింపుల్ హయాతి ఒప్పో రెనో 13 సిరీస్‌ను మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సెల్‌పాయింట్‌లో ఒప్పో రెనో 13 సిరీస్ లాంచ్ చేయడం ఆనందంగా ఉందన్నారు. ఏ కంపెనీ అయినా అప్‌డేటెడ్ మొబైల్ మార్కెట్‌లోకి అందుబాటులోకి తెచ్చిందంటే.. అది ముందుగా సెల్‌పాయింట్‌లో ఆవిష్కరణ అవుతుందన్నారు. విశాఖపట్నంలో సెల్‌ఫోన్లకు సంబంధించి సెల్‌పాయింట్ అడ్డాగా మారిందన్నారు. మంచి ఫీచర్స్‌తో ఒప్పో రెనో 13 సిరీస్ మార్కెట్లో అందుబాటులో ఉందన్నారు. మోహన్ ప్రసాద్ పాండే మాట్లాడుతూ విశాఖపట్నంలో తొలిసారిగా డైమండ్ పార్క్ వద్ద సెల్‌పాయింట్‌ను ప్రారంభించామన్నారు. అంచెలంచెలుగా ఎదుగుతూ విశాఖలో 29, రాష్ట్ర వ్యాప్తంగా 82 సెల్‌పాయింట్ స్టోర్లకు విస్తరించినట్లు వివరించారు. 25 ఏళ్లుగా నాణ్యత గల ఉత్పత్తులు, వినియోగదారుల సేవలందించడంలో సెల్‌పాయింట్ విశ్వసనీయతగా నిలిచిందన్నారు. నూతన ఒప్పో రెనో 13 సిరీస్ కొనుగోలుపై లక్కీ డిప్ ద్వారా బైక్‌తో పాటు పలు బహుమతులు అందజేయనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో సెల్‌పాయింట్ ప్రతినిధి బాలాజీ పాండే, పోతు సత్యనారాయణ పాల్గొన్నారు.

వైభవంగా కూడారై ఉత్సవం

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం శ్రీ సీతారామస్వామి సన్నిధిలో కూడారై ఉత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. ధనుర్మాసాన్ని పురస్కరించుకొని ప్రతి ఏటా భోగీకి ముందు కూడారై ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ మేరకు శనివారం వేకువజామున గోదాదేవి అమ్మవారికి పల్లకీ సేవను అర్చకులు నిర్వహించారు. అనంతరం స్వామి సన్నిధిలో తిరుప్పావై గ్రంధంలోని 27వ పాశురాన్ని ఆలయ అధ్యాపకులు అనుసంధానం చేశారు. కూడారై పాయశాన్ని ప్రత్యేకంగా తయారు చేసి 108 కలశాల్లో స్వామికి నివేదించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు సాయి రామాచార్యులు, నరసింహాచార్యులు, మల్లిఖార్జున శర్మ, వర ప్రసాద్, కిరణ్‌కుమారాచార్యులు, రామ గోపాల్, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.



108 కలశాల్లో స్వామివారికి కూడారై పాయసాన్ని నివేదిస్తున్న అర్చకులు

దొంగతనానికి వెళ్లి.. మృత్యు ఒడిలోకి..



గొర్డు శంకరరావు (ఫైల్)

విజయనగరం క్రైమ్: దొంగతనం చేయడానికి వెళ్లి... మృత్యుఒడిలోకి వెళ్లిపోయిన సంఘటన శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత చోటుచేసుకుంది. దీనికి సంబంధించి టూటౌన్ పోలీసులు శనివారం అందించిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక దాసన్నపేట సమీపంలో నిర్మాణమవుతున్న నాలుగంతస్తుల భవనంలోకి అశోక్ నగర్‌కి చెందిన గొడ్డు శంకరరావు (24) మంగళగిరి సాయి అనే వ్యక్తితో పాటూ మరికొందరు వ్యక్తులతో కలిసి విద్యుత్ వైర్లు దొంగతనం చేయడానికి వెళ్లారు. ఐదో అంతస్తులో ఉన్న రెండు గదుల్లో కరెంటు వైర్లు కత్తిరించి ఆ పక్కనే ఉన్న లిఫ్ట్ కోసం ఉన్న ఖాళీ ప్రదేశంలో శంకరరావు ప్రమాదవశాత్తూ కాలు జారి ఐదో అంతస్తు నుంచి కింద పడిపోయాడు. ఈ ప్రమాదంలో అతని రెండు కాళ్లు విరిగిపోయి, తలకు తీవ్ర గాయమై సంఘటనా స్థలంలోని మృతి చెందాడు. మృతుడు శంకరరావు భార్య రాజేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు టూటౌన్ సీఐ శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రబీకి సాగునీరు విడుదల చేయండి

- అధికారులను కోరిన తోటపల్లి ప్రాజెక్టు చైర్మన్ విజయరమణి
- నీటి విడుదల తమ పరిధిలో లేదని తేల్చి చెప్పిన డీఈఈ గన్నిరాజు



వీరఘట్టంలో జలవనరుల శాఖ అధికారులతో సమావేశమైన తోటపల్లి ప్రాజెక్టు పరిధిలోని నీటి సంఘాల అధ్యక్షులు

వీరఘట్టం: తోటపల్లి పాత ఆయకట్టు ఆధునికీకరణ పనులు ఆగినందున కనీసం ఈ రబీలోనైనా పాత ఆయకట్టుకు సాగునీరు విడుదల చేయాలని ప్రాజెక్టు చైర్మన్ పాదిలాపు విజయరమణి కోరారు. వీరఘట్టంలో జలవనరుల శాఖ అధికారులతో ఇటీవల నూతనంగా ఎంపికైన 25 మంది నీటి సంఘాల అధ్యక్షులు, టీసీలతో కలసి శనివారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కాల్వ పనులు చేస్తున్నామని గత రబీలో నీటి విడుదల ఆపేసారు కదా, ప్రస్తుతం కాల్వ పనులు జరగనందున నీటి విడుదల చేయాలని డిమాండ్ చేసారు. ఈ సందర్భంగా జల వనరుల శాఖ డిఈఈ వై.గన్నిరాజు మాట్లాడుతూ తోటపల్లి పాత ఆయకట్టు పరిధిలో ఉన్న కుడి, ఎడమ కాలువల్లో ఆధునికీకరణ పనులు 25 శాతం దాటనందున ఈ పనులను ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. ప్రాజెక్టుల్లో గరిష్ట నీటి మట్టం 105 మీటర్లు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 104.15 మీటర్లు ఉందన్నారు. ప్రాజెక్టు వద్ద ఇన్‌ఫ్లో 170 క్యూసెక్కులు వస్తుండగా, నదిలోకి 460 క్యూసెక్కుల నీటిని విడిచిపెడుతున్నట్లు తెలిపారు. కొత్త కుడి కాలువ ద్వారా విజయనగరం జిల్లా వాసుల తాగునీటి అవసరాల కోసం వారం రోజులకొకసారి సుమారు 400 క్యూసెక్కుల నీటిని విడిచిపెడుతున్నట్లు తెలిపారు. ఈ పరిస్థితుల్లో పాత ఆయకట్టు కాలువలకు నీటి విడుదల చేయడం కుదరదన్నారు. సాగునీటి విడుదల అంశం తమ పరిధిలో లేదన్నారు.

కలెక్టర్ వద్దే తేల్చుకుంటాం..

తోటపల్లి సాగునీటి విడుదల తమ పరిధిలో లేదని డీఈఈ చెప్పడంతో కొత్తగా ఎంపికైన నీటి సంఘాల అధ్యక్షులు అసంతృప్తి వ్యక్తం చేసారు. మా ప్రాంత రైతులు మమ్మల్ని సాగునీటి కోసం నిలదీస్తున్నారని, మిమ్మల్ని ఎందుకు ఎన్నుకున్నామని ప్రశ్నిస్తున్నారని, ఈ పరిస్థితుల్లో పాత ఆయకట్టుకు నీటి విడుదల చేయకపోతే రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తుందని తమ అభిప్రాయాలను నీటి సంఘాల అధ్యక్షులు వ్యక్తం చేసారు. ఈ విషయాన్ని కలెక్టర్ వద్దే తేల్చుకుంటామని సమావేశం నుంచి అందరూ వెళ్లిపోయారు. సమావేశంలో ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ ఆలుబిల్లి పార్థసారధి, డీసీలు మాచర్ల నందీశ్వరరావు, పార్వతీపురం మన్యం జిల్లా, విజయనగరం జిల్లాల్లో తోటపల్లి ప్రాజెక్టు పరిధిలో ఉన్న నీటి సంఘాల అధ్యక్షులు, టీసీలు, ఏఈ డి.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.


గంజాయి సేవిస్తూ పట్టుబడిన యువకులు



పోలీసులకు పట్టుబడిన గంజాయి సేవిస్తున్న వ్యక్తులు

రాజాం సిటీ: పట్టణ సమీపంలోని రేగిడి మండలం పరిధి బాలకవివలస రోడ్డులో గంజాయి సేవిస్తూ నలుగురు వ్యక్తులు పోలీసులకు పట్టుబడ్డారు. స్థానిక రూరల్ సర్కిల్ కార్యాలయంలో సీఐ హెచ్.ఉపేంద్ర శనివారం విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. బాలకవివలస లే అవుట్ ముళ్లపొదల వద్ద నలుగురు వ్యక్తులు గంజాయి సేవిస్తూ పోలీసులకు చిక్కారన్నారు. ఈ వ్యక్తులు వాటర్ బాటిల్ సహాయంతో గంజాయి కాలుస్తుండగా పట్టుబడినట్లు పేర్కొన్నారు. వీరికి పాలకొండకు చెందిన బొద్దాన దుర్గాప్రసాద్ గంజాయి విక్రయించినట్లు వారు తెలిపారని సీఐ అన్నారు. దీంతో గంజాయి సేవించిన వారితో పాటు విక్రయించిన వ్యక్తిని రేగిడి ఎస్‌ఐ పి.నీలావతి తన సిబ్బందితో పట్టుకుని అరెస్టు చేశారని తెలిపారు. గంజాయి విక్రయిస్తున్న దుర్గాప్రసాద్ వద్ద జీఎంఆర్ ఐటీ తోటలో 1.5 కేజీల గంజాయిని సంతకవిటి ఎస్‌ఐ ఆర్.గోపాలరావు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారని చెప్పారు.

గంజాయితో పట్టుబడిన యువకుడు



గంజాయిని సీజ్ చేసి నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

కొత్తవలస: ఆర్‌టీసీ బస్సులో అక్రమంగా గంజాయిని రవాణ చేస్తున్న ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన రాకేష్‌కుమార్‌ను కొత్తవలస పోలీస్‌లు శనివారం అరెస్టు చేసారు. దీనికి సంబంధించి సీఐ షణ్ముఖరావు తెలిపిన వివరాలు... రాకేష్‌కుమార్ ఆర్‌టీసీ బస్సులో గంజాయిని తరలిస్తున్నట్లు ముందస్తు సమాచారం రావడంతో ఎస్‌ఐ సుదర్శన్‌రావు ఆధ్వర్యంలో పోలీస్‌లు కొత్తవలస ఆర్‌టీసీ కాంప్లెక్ వద్ద మాటు కాసారు. అరకు నుంచి వచ్చిన ప్రతీ బస్సును తనిఖీ చేసారు. ఇందులో భాగంగా 4 కేజీల గంజాయిని రాకేష్‌కుమార్‌ను గుర్తించారు. నిందితుడు రాకేష్‌కుమార్‌ను అదుపులోకి తీసుకొని తహసీల్దార్ నీలకంఠరావు సమక్షంలో గంజాయిని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. నిందితుడిని కొత్తవలస కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు తెలిపారు.

గంజాయి సీజ్



మాట్లాడుతున్న బొబ్బిలి డీఎస్పీ శ్రీనివాసరావు(వెనుక ముసుగులో నిందితుడు)

గజపతినగరం : గజపతినగరం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న రైల్వే స్టేషన్ సమీపంలో బీఎస్‌ఎన్‌ఎల్ ఆఫీస్ వద్ద గంజాయిని సరఫరా చేస్తూ పలువురితో సేవిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామని బొబ్బిలి డీఎస్పీ పి.శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శనివారం ఆయన మాట్లాడారు. స్థానిక సమాచారం మేరకు ఎస్‌ఐ కె.లక్ష్మణరావు సిబ్బందితో కలిసి రైల్వేట్రాక్ వద్దకు వెళ్లగా కొంతమంది వ్యక్తులు పరుగులు తీయగా ఎస్‌ఐ ఆరా తీయడంతో బొండపల్లికి చెందిన గున్నేని నవీన్ కుమార్ (ఒడిశాకు చెందిన వ్యక్తి ఇక్కడ స్థిరపడ్డాడు) నుంచి 400గ్రాములు గంజాయి, మరో మైనర్ నుంచి 300గ్రాములు గంజాయి, మూడు సెల్ ఫోన్‌లు పట్టుబడడంతో వారిని అదుపులోకి తీసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఇందులో మరో ఇద్దరు ఇంటర్మీడియట్ విద్యార్థులను కూడా బాధితులుగా గుర్తించి వారికి కౌన్సెలింగ్ చేసి తల్లిదండ్రులకు అప్పగించినట్లు చెప్పారు. గంజాయిని సరఫరా చేస్తూ సేవించిన నవీన్‌కుమార్‌తో పాటు మరో మైనర్ వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ చెప్పారు. సీఐ జివి.రమణ, ఎస్‌ఐ కె.లక్ష్మణరావు పాల్గొన్నారు.

పరమేశ్వరరావు సేవలు స్ఫూర్తిదాయకం..



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ

విజయనగరం అర్బన్: ఉద్యమ నేత నూతలపాటి పరమేశ్వరరావు సేవలు స్ఫూర్తిదాయకమని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ అన్నారు. ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో పరమేశ్వరరావు తృతీయ వర్ధంతి స్థానిక జెడ్పీ మినిస్టీరియల్ సిబ్బంది సంఘ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పరమేశ్వరరావు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్సీ రఘువర్మ మాట్లాడుతూ.. ఉపాధ్యాయ సమస్యల సాధనలో పరమేశ్వరరావు కృషి మరువలేనిదన్నారు. సంఘ జిల్లా అధ్యక్షుడు షేక్ బుఖారీబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి డి.సరస్వతి, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలతేరు శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడు బంకురు జోగినాయుడు, సీనియర్ నాయకుడు పిల్లా తిరుపతిరావు, ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.